# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-02-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సమావేశమైన రాష్ట్ర మంత్రి వర్గం.**

2. **రాష్ట్ర వ్యాప్తంగా మద్యం దుకాణాల్లో మద్యాన్ని అధిక ధరల విక్రయాలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసిన ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ .**

3. **వికసిత్ భారత్ నిర్మాణానికి దోహదపడేలా కేంద్ర బడ్జెట్ ఉందని వెల్లడించిన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్.**

4. **రాష్ట్రంలోని నగరాలను మాదక ద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్న ఈగల్ విభాగం ఐజి ఏ. రవికృష్ణ.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గం ఈ రోజు సమావేశమైంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో రాష్ట్రాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, సంక్షేమ పథకాల అమలు, పరిపాలనకు సంబంధించిన పలు అంశాలపై మంత్రి వర్గం చర్చిస్తోంది. అలాగే పలు సంస్థలకు భూ కేటాయింపులు, పెట్టుబడులు, పరిశ్రమలకు సంబంధించిన నిర్ణయాలపై మంత్రి వర్గం చర్చించి, ఆమోదించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ సమావేశం అనంతరం వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలు, ఆర్థిక రంగాలపై సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించనున్నారు.

--------------------------

రాష్ట్ర వ్యాప్తంగా మద్యం దుకాణాల్లో మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన ఈ రోజు స్పందించారు. అధిక ధరలకు మద్యం విక్రయాలపై కాకినాడ జిల్లాతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు మద్యం విక్రయాల వ్యవహారంలో దుకాణదారులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. మద్యం దుకాణాలపై నిరంతర నిఘా ఏర్పాటు చేసి అధిక ధరలకు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని ఆబ్కారీ శాఖ అధికారులకు సూచించారు.

--------------------------

వికసిత్ భారత్ నిర్మాణానికి దోహదపడేలా కేంద్ర బడ్జెట్ ఉందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ పేర్కొన్నారు. విజయనగరంలో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, పోర్టుల అభివృద్ధి,

ప్రత్యేక వాయు రవాణా కారిడార్ ఏర్పాటు, ఇంధన శక్తి రంగం వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పారు. బడ్జెట్‌లో సెమీ కండక్టర్ పరిశ్రమకు ఇచ్చిన ప్రోత్సహకాలతో ఓర్వకల్లులోని సెమీ కండక్టర్ పరిశ్రమ మరింత అభివృద్ధి చెందనుందని మంత్రి వివరిస్తూ,

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ ఆర్థికశక్తి కేంద్రంగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. భారత్–అమెరికా దేశాల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై ముఖ్యమంత్రి సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఈరోజు స్పందించారు. సుంకాలను 18 శాతానికి తగ్గించడం ప్రపంచంలోని రెండు గొప్ప ప్రజాస్వామ్య దేశాల మధ్య బంధాన్ని బలోపేతం చేస్తుందని తెలిపారు. నిరంతరం ప్రపంచ వృద్ధిని కాంక్షించేలా ఈ నిర్ణయం ఉందని, ఈ చారిత్రాత్మక ఒప్పందం ఆంధ్రప్రదేశ్ సహా దేశ యువత, రైతులకు అపారమైన అవకాశాలను సృష్టిస్తుందని ముఖ్యమంత్రి. ట్వీట్ లో పేర్కొన్నారు.

---------------------------

లండన్‌లో పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ బృందం పర్యటన కొనసాగుతోంది. అమరావతిలో పలు ప్రాజెక్టుల అభివృద్ధికి సంబంధించి లండన్ లోని పర్యాటక ప్రాజెక్టులను అధ్యయనం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఒలింపిక్ క్రీడలు జరిగిన ప్రాంతాలని మంత్రి బృందం ఈరోజు పరిశీలించనుంది. అమరావతిలోని అంతర్జాతీయ క్రీడా నగర నిర్మాణానికి అనుగుణంగా లండన్‌లో కింగ్స్ క్రాస్ రీడెవలప్ మెంట్ ప్రాజెక్ట్ సందర్శించనుంది.

---------------------------

రాష్ట్రంలోని నగరాలను మాదక ద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దుతామని ఈగల్ విభాగం ఐజి ఏ. రవికృష్ణ పేర్కొన్నారు. "డ్రగ్స్ పై దండయాత్ర" లో భాగంగా విజయవాడలోని శారదా కళాశాల వద్ద " డ్రగ్స్ వద్దు యోగా ముద్దు" నినాదంతో ఈరోజు సైకిల్ యాత్ర నిర్వహించారు. స్థానిక శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు, విజయవాడ పోలీసు కమిషనర్ రాజశేఖర్ బాబుతో కలిసి ఆయన సైకిల్ యాత్ర ప్రారంభించారు. అనంతరం రవికృష్ణ మాట్లాడుతూ, మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు నగరంలోని పలు ప్రాంతాల్లో సైకిల్ యాత్రను నిర్వహిస్తున్నామన్నారు. మత్తు పదార్థాలను వినియోగించే వారి గురించి 1972కి కాల్ చేసి సమాచారం అందించాలని ఆయన కోరారు.

---------------------------

శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 8 నుంచి 18 వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. శ్రీశైలంలోని సదాశివయ్య సత్రంలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై మంత్రులు బి.సి.జనార్దన్‌రెడ్డి, వంగలపూడి అనితతో కలిసి ఆయన నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ..

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

ప్రధాన మంత్రి ఈ-బస్ పథకం ద్వారా ఆర్టీసీకి 2 వేల 500 విద్యుత్ బస్సులు రానున్నాయని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ -ఏపీయస్ఆర్టీసీ ఇన్‌ఛార్జి ఎండీ ఎంటీ కృష్ణబాబు తెలిపారు. విజయవాడలోని ఆర్టీసీ హౌస్‌లో ఎండీగా ఆయన నిన్న బాధ్యతలు చేపట్టారు. సంస్థ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం కృష్ణబాబు పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రయాణికులకు అందుతున్న సేవలపై ప్రభుత్వం అభిప్రాయాలు తీసుకుంటోందని తెలిపారు. విద్యుత్ ఆర్టీసీ బస్సులకు అనుగుణంగా ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు వంటి చర్యలు చేపడుతున్నామని ఆయన తెలియజేస్తూ,

వాయిస్ .. 30 సెకన్లు

--------------------------

దేశంలో “భిన్నత్వంలో ఏకత్వం” భావనను బలోపేతం చేసేందుకు అంతర్రాష్ట్ర యువజన మార్పిడి కార్యక్రమం-ISYEP వంటివి ఉపయోగపడతాయని కేంద్ర యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ మై భారత్ ఉమ్మడి కృష్ణా జిల్లా అధికారి సుంకర రాము అన్నారు. యూత్ ఎక్స్ ఛేంజ్ కార్యక్రమంలో భాగంగా మేరా యువ భారత్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా మైలవరంలోని ఇంజనీరింగ్ కళాశాలో ఈ రోజు నుంచి నిర్వహిస్తున్న కార్యక్రమంలో కేరళలోని వివిధ జిల్లాల నుండి వచ్చిన 37 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుంకర రాము మాట్లాడుతూ, వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో సాంస్కృతిక ప్రదర్శనలు, బృంద చర్చలు, క్షేత్ర సందర్శనలు, భాషా అభ్యాసం వంటివి నిర్వహిస్తామని చెప్పారు. భారత దేశపు సాంస్కృతిక వైవిధ్యాన్ని, ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడంలో ఇటువంటి కార్యక్రమాలు సహాయపడతాయని వివరించారు.

--------------------------

ఆంధ్ర ప్రదేశ్, యానంలో దిగువ ట్రోపో ఆవరణములో ఈశాన్య, తూర్పు దిశగా గాలులు వీస్తున్నాయి అని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర, దక్షిణ కోస్తా జిల్లాల్లో ఈరోజు, రేపు పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉందని అమరావతి వాతావరణం కేంద్రం అధికారి ఎల్. నారాయణ పేర్కొన్నారు.

--------------------------

సింగపూర్ ప్రభుత్వ అధికారుల బృందం బాపట్ల జిల్లాలో ఈ రోజు పర్యటిస్తోంది. బాపట్ల కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న బృందానికి జిల్లా అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సింగపూర్ బృందంతో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ సమావేశమయ్యారు. జిల్లా దీర్ఘకాలిక వృద్ధి లక్ష్యాల ప్రణాళికలు వారికి వివరించడంతో పాటు, జిల్లాలోని పర్యాటకం, ఆక్వా రంగాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యల గురించి వారికి వివరించారు.

--------------------------

బ్రాండ్ పేరు లేకుండా, రిటైల్ విక్రయానికి ఉపయోగించే ప్యాక్ చేయని పొగాకు పై ఎక్సైజ్ సుంకం ఎత్తివేతతో రైతులకు ఊరట కలుగుతుందని రాజమహేంద్రవరం పార్లమెంట్ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ నెల 1న విడుదల చేసిన గెజిట్ ప్రకారం అన్ మాన్యుఫ్యాక్చర్డ్ పొగాకుపై పన్ను విధానంలో కేంద్ర ప్రభుత్వం సవరణ చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ‘పొగాకు రైతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను రైతుల బృందంతో కలిసి ఇటీవల ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు వివరించామని, లేఖ ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టికీ తీసుకువెళ్లామని, ఈ నేపథ్యంలోనే రైతులకు ఉపశమనం కలిగేలా నిర్ణయం తీసుకున్నారని తెలిపారు.

=====================